క్లుప్తంగా

ఓటరు చైతన్య గీతం ఆవిష్కరణ



ఓటే మన ఆయుధం అనే గీతం ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ నివాస్

కాకినాడ సిటీ: జిల్లాలో స్వీప్ కార్యక్రమాల్లో భాగంగా జిల్లా స్వీప్ అంబాసిడర్ యశస్వీ కొండేపూడి రూపొందించిన ఓటరు చైతన్య గీతం ఆవిష్కరణ బుధవారం రాత్రి స్థానిక వివేకానంద పార్క్ వద్ద ఫ్యాబిన్ కన్వెన్షన్ కళావేదికలో నిర్వహించారు. కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి జె.నివాస్ ముఖ్య అతిథిగా హాజరై గీతాన్ని ఆవిష్కరించారు. జిల్లాలోని అన్ని ప్రాంతాలకు ఈ గీతం చేరేలా షేర్ చేయడంతో పాటు ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ నివాస్ కోరారు.

మీడియా సమాచార కేంద్రం పరిశీలన

కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమాచార కేంద్ర, ఎంసీఎంసీ, కంట్రోల్ రూమ్‌ను ఎన్నికల జిల్లా పరిశీలకులు రాజేష్ జోగ్‌పాల్ బుధవారం సందర్శించి పరిశీలించారు. మీడియా సర్టిఫికేషన్, మీడియా మోనిటరింగ్ కమిటీ పనితీరు, వివిధ రాజకీయ పార్టీల అభ్యర్థులకు ఇస్తున్న ప్రచారం అనుమతులు వంటి వివరాలను సమాచార శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. సమాచారశాఖ డీడీ నాగార్జున, అధికారులు బాబూరావు, పి.రవి, డిప్యూటీ కలెక్టర్ భారతి తదితరులు పాల్గొన్నారు.

కంట్రోల్, మీడియా సెంటర్ల పరిశీలన

ఎన్నికల ప్రక్రియలో భాగంగా కాకినాడ జేఎన్‌టీయూలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లను బుధవారం రాత్రి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జె.నివాస్, వీసీ జీవీఆర్ ప్రసాద్‌రాజు, రెవెన్యూ, సర్వే, సమాచార పౌరసంబంధాల శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు.

కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

కాకినాడ రూరల్: ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎన్నికల పరిశీలకుడు రాజేష్ జోగ్‌పాల్ పేర్కొన్నారు. సర్పవరం జంక్షన్ వద్ద కాకినాడ రూరల్ ఎన్నికల రిటర్నింగ్ కార్యాలయంలో ఆర్వో ఇట్ల కిశోర్ అధ్యక్షతన బుధవారం అభ్యర్థులు, ఏజెంట్లకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న ఎన్నికల పరిశీలకుడు రాజేష్ జోగ్ పాల్ మాట్లాడుతూ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు, రాజకీయ పార్టీలు కచ్చితంగా నియమావళికి లోబడి తమ కార్యక్రమాలు నిర్వహించుకోవాలన్నారు. ఫిర్యాదులు అందితే నిర్ణీత గడువులోపు చర్యలు తీసుకోవాలని ఆర్వో, ఏఆర్వోలను సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సురేష్ పాల్గొన్నారు.

దాత ఆశయాల మేరకు సేవ చేస్తా



ఈఓగా బాధ్యతలు స్వీకరిస్తున్న ఫణికుమార్

బోట్‌క్లబ్: దాత ఆశయాలకు అనుగుణంగా సత్రం ద్వారా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తానని పెద్దమార్కెట్‌లోని బంగారు చినశోభనాద్రి సత్రం ఈఓ వడ్డి ఫణికుమార్ అన్నారు. సత్రం ఈఓగా బుధవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. గతంలో సత్రం ఈఓగా పనిచేసిన అడబాల శ్రీనివాస్ పదవీవిరమణ చేయడం దేవదాయశాఖ ఇన్‌చార్జి ఆర్‌జేసీ ఎం విజయరాజు ఆయన స్థానంలో ఫణికుమార్‌ను నియమించారు.

51 శాతం పెన్షన్ల పంపిణీ



చిట్టయ్యతోటలో అర్జమ్మకు పెన్షన్ ఇస్తున్న డిజిటల్ అసిస్టెంట్ తిలకరాజ్

కరప: మండల పరిధిలో ఎన్నికల కోడ్‌కు లోబడి బుధవారం పింఛన్ల పంపిణీ చేసినట్టు ఎంపీడీఓ కె.అప్పారావు తెలిపారు. మండలంలోని 23 గ్రామ పంచాయతీల పరిధిలో 11,625 మంది పెన్షనర్లలో 8,793 మందికి బ్యాంక్ అకౌంట్లు ఉన్నాయని, వారికి నేరుగా రూ.2,63,79,000 ఖాతాల్లో జమ చేసినట్టు తెలిపారు. మిగిలిన 2,832 మందికి సచివాలయ సిబ్బంది వారి ఇళ్లకు వెళ్లి ఇచ్చారన్నారు. ఈఓపీఆర్డీ బీఏ సత్యనారాయణ, గ్రామ కార్యదర్శుల పర్యవేక్షణలో 1,455 మందికి (51.38 శాతం) వెల్ఫేర్ అసిస్టెంట్లు లబ్ధిదారుల ఇంటికి వెళ్లి అందజేశారన్నారు. మిగిలిన 1377 మందికి గురువారం అందజేస్తామని ఎంపీడీఓ తెలిపారు.

అమెజాన్ ఫ్యూచర్ ప్రోగ్రాంకు జేఎన్‌టీయూకే విద్యార్థులు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జేఎన్‌టీయూకే సీఎస్ఈ విద్యార్థులు అమెజాన్ ఫ్యూచర్ ఇంజినీర్ పోగ్రాంకు ఎంపికైనట్టు వీసీ ప్రసాదరాజు తెలిపారు. సీఎస్ఈ ప్రథమ సంవత్సర విద్యార్థులు జి.పద్మప్రియ, ఎం.కవితలు ఎంపికైయారని, బీటెక్ అనంతరం ఇదే సంస్థలో శాశ్వత ప్రాతిపదకన ఉద్యోగం వస్తుందన్నారు. విద్యార్థులను వీసీ ప్రసాదరాజుతో పాటు ప్రిన్సిపాల్ కృష్ణప్రసాద్, టీపీఓ కరుణ, సీఎస్ఈ విభాగాధిపతి ఒ.శ్రీనివాసరావు అభినందించారు.

పెద్ద కొడుకై ఆదుకున్నాడు..

30,277 మందికి రూ.9.5 కోట్ల లబ్ధి

పింఛన్లు	లబ్ధిదారులు
అభయహస్తం	485
అమరావతి ల్యాండ్‌లెస్ పూర్	1
సీకేడీయూ	62
డీఎంహెచ్‌ఓ	124
డప్పు కళాకారులు	96
దివ్యాంగులు	3,514
మత్స్యకారులు	877
ఓఏపీ	15,369
ఆర్టిస్ట్‌లు	12
సైనికులు	4
ఒంటరి మహిళలు	959
కల్లుగీత కార్మికులు	700
చర్మకారులు	80
ట్రాన్స్‌జెండర్	4
చేనేత కార్మికులు	181
విడోస్	7,80

- అర్హులందరికీ పింఛన్లు
- గత కాలపు కష్టాలకు విముక్తి
- జగనన్నతోనే బతుకు బంగారం



టీడీపీ హయాంలో కరప పంచాయతీ వద్ద సర్వర్ పనిచేయక నిరీక్షిస్తున్న లబ్ధిదారులు (ఫైల్)



కరపలో స్థానిక నాయకులతో కలసి కొత్త పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు (ఫైల్)

కరప: ఏ ఆధారం లేని పేదల జీవితాలకు వైఎస్సార్ పింఛన్ కానుక వెలుగులు నింపుతోంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక ఆయనిచ్చే పింఛన్లతో కడుపు నింపుకొంటున్నామని వృద్ధులు, మహి ళలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. గతంలో 65 ఏళ్లు ఉంటే కానీ పింఛన్ ఇచ్చేవారు కాదని, అవి కూడా ఏడాదికి ఒకసారి గ్రామానికి అయిదారు కంటే ఎక్కువ వచ్చేవి కావని, పింఛన్ కోసం ఎదురుచూపులే మిగిలేవని టీడీపీ నిర్వాకాన్ని గుర్తు చేసుకుంటున్నారు. జగనన్న ప్రభుత్వంలో 60 ఏళ్ల వారికే ప్రతి ఆరు నెలలకొకసారి ఇస్తున్నారని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

వలంటీర్లే దరఖాస్తు చేసేవారు

గ్రామ వలంటీర్, సచివాలయ వ్యవస్థలను తీసుకువచ్చి, పంచాయతీరాజ్ వ్యవస్థలో సీఎం జగన్ విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చారు. వలంటీర్లు తమకు కేటాయించిన 50 కుటుంబాలలో ఎవరెవరు ఏపింఛన్‌కు అర్హులో గుర్తించి, లబ్ధిదారులతో దరఖాస్తు చేయించి పింఛన్లు మంజూరు చేయించారు.

పింఛన్ ఇచ్చి ఆదుకున్నారు



టీడీపీ హయాంలో పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్నా పట్టించుకోలేదు. వలంటీర్ వచ్చి పింఛన్ వస్తోందా అని అడిగితే రావడంలేదని చెప్పగానే తమతో దరఖాస్తు చేయించి మంజూరు చేయించారు. పింఛన్ సొమ్ము ఇంటికి తీసుకొచ్చి ఇస్తున్నారు. ముఖ్యమంత్రి జగన్‌కు రుణపడి ఉంటాను. – పోలినాటి పెదకొండయ్య, వేములవాడ.

ముఖ్యమంత్రి మేలు మరువలేను



భర్తపోవడంతో ఆధారం కోల్పోయాను. వలంటీర్ ఇంటికి వచ్చి సంతకం చేయించుకుని, దరఖాస్తు చేయగానే పింఛన్ మంజూరైందని ఇంటికి డబ్బులు తీసుకొచ్చి చేతిలోపెట్టారు. ముఖ్యమంత్రి జగన్ మేలు మరువలేను. ఎప్పటికీ ఆయనే ముఖ్యమంత్రి ఉండాలి.

– అనుసూరి లక్ష్మి, వేములవాడ

ఖర్చులు పక్కాగా నమోదు చేయండి

వ్యయ పరిశీలకుడు ఆసిఫ్ ఆదేశం



ఎన్నికల వ్యయ నమోదుపై సూచనలిస్తున్న పరిశీలకుడు ఆసిఫ్. చిత్రంలో ఆర్వో వెంకటరావు

కాకినాడ: ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా అభ్యర్థుల వ్యయాలను పక్కాగా నమోదు చేయాలని ఎన్నికల వ్యయ పరిశీలకులు ఆసిఫ్.ఏ రాజకీయ పార్టీలను కోరారు. స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో బుధవారం పోటీ చేసే అభ్యర్థుల ఎన్నికల వ్యయం రికార్డులను తొలి విడత తనిఖీ చేశారు. సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జే.వెంకటరావు, సహాయ వ్యయ పరిశీలకులు ఎస్.రాఘవేంద్ర, అకౌంటింగ్ సిబ్బంది సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. రెండవ విడత ఈనెల ఆరవ తేదీన, మూడో విడత పదో తేదీన రికార్డులను తనిఖీ చేస్తామన్నారు. ఈ సందర్భంగా పోటీ చేసే అభ్యర్థులు /ఏజెంట్ల సమక్షంలో రికార్డుల తనిఖీతో పాటు ఈవీఎం, వీవీ ప్యాట్‌ల ర్యాండమైజేషన్ కూడా పూర్తి చేశారు. సమావేశంలో ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

అమలుకాని హామీలతో టీడీపీ మేనిఫెస్టో



ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే ద్వారంపూడి





ఎన్నికల ప్రచారంలో ద్వారంపూడి సతీమణి మహాలక్ష్మి, కుమార్తె డాక్టర్ అంజని

- వనమాడికి ఓటేస్తే అవినీతి మయం
- ఎన్నికల ప్రచారంలో ద్వారంపూడి

కాకినాడ: అమలుకాని హామీలతో ప్రకటించిన కూటమి మేనిఫెస్టోను నమ్మొద్దని వైఎస్సార్ సీపీ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి ద్వారంపూడి చంద్రశేఖర రెడ్డి ఓటర్లకు సూచించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం 20వ డివిజన్ రణదీప్‌నగర్, సమీర్‌నగర్, లక్ష్మీనగర్, బిస్మిలానగర్ ప్రాంతాల్లో ఆయన ఇంటింటా ప్రచారం చేసి ఎంపీ అభ్యర్థి సునీల్, ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు ఫ్యాన్‌గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఒకసారి కలిసి పోటీ చేసి ఆ తరువాత మళ్లీ విడివిడిగా ప్రజల ముందుకు వచ్చిన కూటమి ఇప్పుడు మరోసారి కలిసిపోటీ చేస్తుందని, ఇది ఆ పార్టీల స్వార్థ రాజకీయాలకు పరాకాష్ట అని విమర్శించారు. గతంలో ఎమ్మెల్యేగా గెలిచిన వనమాడి కొండబాబు ప్రజాసేవను పక్కన పెట్టి అవినీతితో ఐదంతస్తుల భవనాన్ని కట్టుకున్నారని, ఇప్పుడు మళ్లీ ఓటువేస్తే మరో ఐదంతస్తుల భవనాన్ని కూడా కడతారంటూ విమర్శించారు. లంచాలు తావులేని పారదర్శక పాలన కావాలంటే వైఎస్సార్ సీపీని గెలిపించాలని, ఓటర్లు విజ్ఞతతో ఆలోచించి ఓటు వేయాలని సూచించారు. టీడీపీ అభ్యర్థి వనమాడి ప్రజల్లోకి వెళ్ళలేక ఇంటి వద్దే సమావేశాలు పెట్టుకుంటున్నారని, ఇందుకు ప్రధాన కారణం 2014లో ఇచ్చిన హామీలకు ఎగనామం పెట్టడంతో ప్రజలు నిలదీస్తారనే భయంతోనే ఆయన ఇంటింటి ప్రచారానికి దూరంగా ఉన్నారన్నారు. తన కుటుంబసభ్యులతో కలిసి రోజుకి 10వేల మంది ఓటర్లను కలుస్తున్నామన్నారు. ఆయన వెంట మాజీ కార్పొరేటర్లు వెలమల మల్లేశ్వరరావు, కొప్పనాతి నాగసత్యనారాయణ తదితరులు ఉన్నారు.

సతీమణి, కుమార్తె ప్రచారం

ఎమ్మెల్యే సతీమణి ద్వారంపూడి మహాలక్ష్మి, కుమార్తె డాక్టర్ అంజని వేర్వేరుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. 23వ డివిజన్‌లో కుమార్తె డాక్టర్ ప్రణీత, 43వ డివిజన్ ట్రెజరీకాలనీలో ద్వారంపూడి మహాలక్ష్మి విస్తృత ప్రచారం చేశారు. ఇంటింటికి వెళ్లి ఐదేళ్లలో ద్వారంపూడి చేసిన అభివృద్ధిని వివరిస్తూ ఆయనకు హ్యాట్రిక్ విజయాన్ని అందించాలని కోరారు. వీరి వెంట ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఏఎంసీ చైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి, స్థానిక నాయకులు మీసాల దుర్గాప్రసాద్, మీసాల శ్రీదేవి, మాజీ కార్పొరేటర్‌లు జేడీ పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సినీహీరో విజయకృష్ణారెడ్డి ప్రచారం

కాకినాడ: గణ, దుర్మార్గుడు, పాగల్, గోవిందా–గోవిందా చిత్రాలలో హీరోగా నటించిన విజయ్‌కృష్ణారెడ్డి బుధవారం వైఎస్సార్ సీపీ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డికి మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. 12వ డివిజన్ స్వర్ణాంధ్రకాలనీ ఆయన ఇంటింట ప్రచారం చేశారు. కాకినాడలో వైఎస్సార్ సీపీకి, ఎమ్మెల్యే ద్వారంపూడి నాయకత్వానికి మంచి ఆదరణ కనపిస్తోందని, మంచి మెజార్టీతో ద్వారంపూడి గెలవనున్నారన్నారు.

ల్యాండ్ టైట్లింగ్‌పై డ్రామాలు వద్దు

- చేతనైతే కేంద్రాన్ని ప్రశ్నించాలి
- చంద్రబాబుపై ఎమ్మెల్యే ద్వారంపూడి ధ్వజం

కాకినాడ: అమలులోకి రాని ల్యాండ్ టైట్లింగ్‌చట్టంపై రాజకీయ ప్రయోజనాల కోసం ఎల్లో మీడియాతో కలిసి టీడీపీ అధినేత చంద్రబాబు డ్రామాలాడుతున్నారని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి మండిపడ్డారు. కేంద్ర పరిధిలో ఉండి ఆంధ్రప్రదేశ్‌తో సంబంధంలేని అంశానికి మసిపూసి మారేడుకాయ చేసి సీఎంపై అభాండాలు వేస్తున్నారంటూ ధ్వజమెత్తారు. బుధవారం సాయంత్రం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఈ చట్టం ద్వారా భూములన్నీ సీఎం జగన్ పేరిట రిజిస్ట్రేషన్ చేస్తున్నారంటూ దుష్ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. దేశవ్యాప్తంగా అమలు చేసేందుకు మోదీ సర్కార్ ప్రతిపాదన చేసిందని, ఆ విషయాన్ని కప్పిపుచ్చి సీఎంపై బురదచల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ చట్టాన్ని అన్ని రాష్ట్రాలతో పాటు ఏపీలో కూడా అమలు చేస్తామని ప్రభుత్వం స్పష్టం చేసిందన్నారు. కేంద్రంలోని బీజేపీ కూటమిలో కొనసాగుతూ ఆ చట్టాన్ని రద్దు చేస్తామంటూ చంద్రబాబు మేనిఫెస్టోలో పెట్టడాన్ని ప్రజలను మోసం చేయడం కాదా అని ప్రశ్నించారు. చేతనైతే మోదీని ప్రశ్నించాలని నిలదీశారు. ఏపీలో 30 లక్షల మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చి దాదాపు 3.22 లక్షల ఎకరాలను గిరిజనులకు ఆర్వోఎఫ్ఆర్ పట్టాలు ఇచ్చిన తమ ప్రభుత్వంపై ఉద్దేశ పూర్వకంగానే తప్పుడు ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. టీడీపీ ఎన్ని ప్రయత్నాలు చేసినా ప్రజలు వాస్తవాలను గమనిస్తున్నారన్నారు.

జగన్ సీఎం కావడమే లక్ష్యంగా పనిచేయండి



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే ద్వారంపూడి

కాకినాడ: రానున్న ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావడమే లక్ష్యంగా పార్టీలో చేరిన ప్రతి ఒక్కరూ పనిచేయాలని వైఎస్సార్ సీపీ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి వందలాది మంది టీడీపీ, జనసేన పార్టీల నుంచి పెద్ద ఎత్తున వైఎస్సార్ సీపీలో చేరారు. వీరందరికీ ఎమ్మెల్యే ద్వారంపూడి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. స్థానిక 13వ డివిజన్ సంజయ్‌నగర్ నుంచి శ్రీనివాసరెడ్డి, మేడపాటి చైతన్యకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో సుమారు 50 మంది పార్టీలో చేరారు. 7వ డివిజన్ అరుంధతి రామాలయం ప్రాంతం నుంచి యువ నాయకులు మల్లిపాముల గణపతి ఆధ్వర్యంలో సుమారు 40 మంది, 27వ డివిజన్ దూదిమిల్లు ప్రాంతం నుంచి వరిపల్లి కృష్ణవేణి, మన్నె నాగేశ్వరరావు, సూర్యప్రకాష్ ఆధ్వర్యంలో సుమారు 50 మంది, స్థానిక 45వ డివిజన్ శ్రీరామ్ నగర్ ప్రాంతం నుంచి యాళ్ల వెంకటేశ్వరరావు, కర్రి శైలజ, కర్రి అనంతలక్ష్మి, కృష్ణ సమక్షంలో సుమారు 50 మంది, స్థానిక 24వ డివిజన్ ముగ్గపేట నుంచి టీడీపీ ఎస్సీసెల్ కార్యదర్శి కోరుమిల్లి శేషు ఆధ్వర్యంలో సుమారు 100 మంది, అలాగే మాజీ కార్పొరేటర్ కంపర బాబి ఆధ్వర్యంలో గొడారి గుంట ప్రాంతం నుంచి సుమారు 20 మంది వైఎస్సార్ సీపీలో చేరారు. రాజీవ్‌గృహకల్ప ప్రాంతం నుంచి సుమారు 100 మంది, ఏఎంసీ వైస్ చైర్మన్ దోణి చిట్టిబాబు ఆధ్వర్యంలో 18వ డివిజన్ నుంచి 40 మంది పార్టీలో చేరారు.

మత్స్యకారులకు అండగా జగనన్న ప్రభుత్వం

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- వైఎస్సార్ సీపీలోకి భారీగా వలసలు
- పగడాలపేట, సూర్యారావుపేటల నుంచి చేరిక





రమణయ్యపేట క్యాంపు కార్యాలయం వద్ద వైఎస్సార్ సీపీలోకి చేరిన తూరంగి పగడాలపేట, సూర్యారావుపేట మత్స్యకారులతో ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

కాకినాడ రూరల్: మత్స్యకారులకు జగనన్న ప్రభుత్వం మాత్రమే అండగా ఉందని వైఎస్సార్ సీపీ కాకినాడ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి కురసాల కన్నబాబు పేర్కొన్నారు. వేట నిషేధ భృతి రూ.10 వేలు, బీమా రూ.10 లక్షలు వర్తింపజేసి ఆదుకోవడమే కాకుండా సంక్షేమ పథకాలు మత్స్యకారులకు అందించారని తెలియజేశారు. మండలంలోని తూరంగి పగడాలపేట, సూర్యారావుపేట గ్రామాల నుంచి మత్స్యకారులు సుమారు 450 మంది కన్నబాబు సమక్షంలో వైఎస్సార్ సీపీలో బుధవారం చేరారు. కాకినాడ వైద్యనగర్ క్యాంపు కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో పగడాలపేటకు చెందిన మత్స్యకార నాయకుడు యజ్జల రాము, వైఎస్సార్ సీపీ నాయకులు ఆధ్వర్యంలో టీడీపీ, జనసేన నుంచి పెనమల్ల శ్రీను, రంగారావు, బొందు చిన్నారావు తదితరులతో పాటు సుమారు 350మంది చేరారు. కార్యక్రమంలో కురసాల సత్యనారాయణ, యజ్జల వీరబాబు, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు. అలాగే ఇదే గ్రామానికి చెందిన చెక్కా సత్తిబాబు ఆధ్వర్యంలో చెక్కా రాజు, చెక్కా రాజు, చిన రాజు, శివాజీ తదితరులు 50మంది చేరారు. అలాగే సూర్యారావుపేట గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ ముఖ్యనాయకుల ఆధ్వర్యంలో టీడీపీ, జనసేన కార్యకర్తలు గరికిన మసేను, మైలపల్లి సత్తిబాబు, పేర్ల జగన్నాథం తదితరులతో పాటు 50 మంది కన్నబాబు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. కార్యక్రమంలో సూరాడ రాజు, సింహాద్రి, తదితరులు పాల్గొన్నారు. మత్స్యకారులు వైఎస్సార్ సీపీ పక్షాన ఉన్నారని, టీడీపీ, జనసేనలో ఉన్నవారు కూడా జోరుగా చేరుతున్నారన్నారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి తమను గెలిపించాలని కోరారు.

సంక్షేమ ప్రభుత్వానికి అండగా నిలవండి



వాకలపూడిలో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి కురసాల కన్నబాబు



తిమ్మాపురంలో ర్యాలీ చేస్తున్న సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ తదితరులు

కాకినాడ: పేదల అభ్యున్నతే ధ్యేయంగా సంక్షేమ పథకాలు అందజేసిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి అండగా ఉండాలని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి కురసాల కన్నబాబు కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని వాకలపూడి గ్రామంలో బుధవారం రాత్రి పర్యటించారు. గ్రామంలో వీధివీధిలో ప్రచారం చేస్తూ ప్రజలకు అభివాదం చేశారు. రానున్న ఎన్నికల్లో సీఎం జగన్‌కు అండగా నిలిచేందుకు ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని కోరారు. కాకినాడ రూరల్‌లో ఐదేళ్ల పాటు పెద్ద ఎత్తున అభివృద్ధి చేశామని, అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు ఇచ్చామన్నారు. కార్యక్రమంలో గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తిమ్మాపురంలో భారీ ర్యాలీ

కాకినాడ: వైఎస్సార్ సీపీ విజయం కోరుతూ ఎమ్మెల్యే అభ్యర్థి కురసాల కన్నబాబు, ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్‌కు మద్దతుగా మండలంలోని తిమ్మాపురంలో ఆ పార్టీ శ్రేణులు బుధవారం సాయంత్రం 300 మందితో భారీ ర్యాలీ నిర్వహించారు. సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ ఆధ్వర్యంలో వైస్ ఎంపీపీ బందిలి వీరీషా, ఎంపీటీసీ ముద్దన వెంకటరాజు, శ్రీను చంద్ర తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు మేడే శుభాకాంక్షలు

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- సర్పవరం జంక్షన్ వద్ద మేడే వేడుక



సర్పవరం జంక్షన్‌లో జెండా ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు



లారీ కార్మికునికి చెక్కును అందజేస్తున్న శ్రీనివాసరాజు

కాకినాడ రూరల్: కార్మికులకు ఎమ్మెల్యే కురసాల కన్నబాబు మేడే శుభాకాంక్షలు తెలిపారు. సర్పవరం జంక్షన్‌లో బుధవారం జరిగిన వేడుకల్లో ఆయన పాల్గొని జెండాను ఆవిష్కరించారు. కార్మిక సంక్షేమమే ధ్యేయంగా తమ సీఎం జగన్ పనిచేశారన్నారు. అచ్చంపేట జంక్షన్ వద్ద జయహో రథసారధి లారీ డ్రైవర్స్ అండ్ క్లీనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వాసు యేలేటి ఆధ్వర్యంలో జరిగిన వేడుకలో వైఎస్సార్ సీపీ మహిళా విభాగం నేత జమ్మలమడక నాగమణి పాల్గొన్నారు. కాకినాడ సీపోర్టు, వివిధ పరిశ్రమల్లో కార్మికులు మే డే నిర్వహించారు. రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో జరిగిన వేడుకల్లో అడబాల రత్నప్రసాద్, డాక్టరు అడ్డాల సత్యనారాయణ, చింతపల్లి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో..

కాకినాడ సిటీ: జిల్లా సీఐటీయూ కార్యాలయం వద్ద మేడే నిర్వహించారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ రాజ్‌కుమార్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బైక్ ర్యాలీ నిర్వహించారు. యూనియన్ నాయకులు మలకా వెంకటరమణ, ఎస్ ఈశ్వరి, సిహెచ్ వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో..

కాకినాడ సిటీ: ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో బుధవారం మేడే నిర్వహించారు. పర్లోవపేట మహాత్మ జ్యోతిరావుపూలే కాలనీలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు జె.వెంకటేశ్వర్లు అమరవీరులకు నివాళులర్పించారు. ప్రభుత్వ ఆసుపత్రి వద్ద మెడికల్ అండ్ హెల్త్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలోను, పాతబస్టాండ్ వద్ద ఐఎఫ్‌టీయూ కార్యాలయంలోను మే డే నిర్వహించారు. బంగారు సత్యనారాయణ, ఎం.భైరవస్వామి, ఎం.రాజు, ఎస్.రాజేష్, తదతరులు పాల్గొన్నారు. అలాగే తూరంగి పంచాయతీ కార్యాలయం వద్ద, అల్లూరి సీతారామరాజు కాలనీలో మేడే నిర్వహించారు. అంగన్వాడీ వర్కర్ విజయ ఆధ్వర్యంలో మేడే జెండా ఎగురవేశారు.


కరపలో..

కరప: మండలంలోని కరప, నడకుదురు తదితర గ్రామాల్లో సీఐటీయూ ఆధ్వర్యంలో పలు కార్మిక సంఘాలు మేడే నిర్వహించాయి. మండల సీఐటీయు అధ్యక్షుడు కె.సురేష్, సీఐటీయు ప్రతినిధులు మచ్చా భవానీ, పి.వరలక్ష్మి, వీరవేణి, నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు. అలాగే వేళంగిలో ఐఎఫ్‌టీయు ఆధ్వర్యంలో ప్రగతిశీల భవన నిర్మాణ కార్మిక సంఘం(ఐఎఫ్‌టీయు), పంచాయతీ వర్కర్స్ యూనియన్ మేడే నిర్వహించాయి. ఐఎఫ్‌టీయు జిల్లా ఉపాధ్యక్షుడు రాగుల రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

లారీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో..

కాకినాడ సిటీ: మోటారు లారీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కాకినాడ పాత పోస్టాఫీసు వీధిలో మే డే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు, మోటార్ లారీ వర్కర్స్ యూనియన్ ఇన్‌చార్జి నడింపల్లి శ్రీనివాసరాజు మే డే జెండాను ఆవిష్కరించారు. అర్హులైన వర్కర్స్ అందరికీ పెన్షన్ రాశారని, 42 మంది వరకు సీఎం జగన్ స్ఫూర్తితో ఇంటి వద్దనే పెన్షన్ అందజేస్తున్నట్టు తెలిపారు. కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తున్న జగన్‌ను తిరిగి ముఖ్యమంత్రిగా తిరిగి గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. బ్రెయిన్‌డెడ్ అయి మంచం పట్టిన లారీ డ్రైవర్ సరగడ సూర్యప్రకాష్‌కు రూ.1.30 లక్షల సీఎం సాయం చెక్కును శ్రీనివాసరాజు అందజేశారు. ప్రమాదవశాత్తు మరణించిన తుమ్మల రవికుమార్ కుటుంబానికి రూ. 25 వేలు చెక్కును అందజేశారు.

ఓటర్లలో చైతన్యానికి సెల్ఫీ పాయింట్



ఓటరు స్లిప్పుల పంపిణీని పరిశీలిస్తున్న ఆర్వో

కాకినాడ: 'ఓటు' విలువను వివరించే లక్ష్యంతో స్వీప్ కార్యక్రమం ద్వారా విస్తృత ప్రచారం చేస్తోంది. ఇందులో భాగంగా ఈఆర్వో జె.వెంకటరావు పర్యవేక్షణలో నగరంలో రద్దీగా ఉండే ప్రాంతాల్లో సెల్ఫీ పాయింట్లు ఏర్పాటు చేస్తున్నారు. 'నేను కచ్చితంగా ఓటు హక్కు వినియోగించుకుంటాను' అనే నినాదంతో ఓటర్లను చైతన్య పరుస్తున్నారు. ఇందులో భాగంగా స్థానిక శ్రీనగర్‌లోని జన్మభూమి పార్క్‌లో బుధవారం సెల్ఫీ పాయింటు ఆర్వో బుధవారం ప్రారంభించారు. ప్రజాస్వామ్యంలో ఓటు ప్రాధాన్యాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలని, ఓటును దుర్వినియోగం చేసుకోరాదని, ప్రలోభాలకు లొంగకుండా ఓటు వేయాలని సూచించారు. ఓటు విలువ తెలియచెప్పేలా శారదా దేవి ఆలయం ప్రాంతంలోని కాకినాడ నగరపాలక సంస్థ కార్యాలయం, వివేకానంద పార్క్, జన్మభూమి పార్కులలో ఈ సెల్ఫీ పాయింట్లు ఏర్పాటు చేశామన్నారు. నగరపాలక సంస్థ సూపరింటెండెంట్ ఇంజినీర్ పి. సత్యకుమారి, స్మార్ట్ సిటీ ఎస్ఈ పి.వెంకటరావు, ఈఈ మాధవి, ఇతర అధికారులు ఉన్నారు.

8వ తేదీలోపు ఓటర్ స్లిప్పుల పంపిణీ

ఓటర్ ఇన్ఫర్మేషన్ స్లిప్పుల పంపిణీని వేగవంతం చేయాలని సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జె.వెంకటరావు బీఎల్‌ఓలను ఆదేశించారు. బుధవారం ఆయన శారదాదేవి ఆలయ ప్రాంతంలో ఓటర్ స్లిప్పుల పంపిణీని పరిశీలించారు. నియోజకవర్గంలోని 234 పోలింగ్ బూత్‌ల పరిధిలో ఓటర్లకు స్లిప్పుల పంపిణీ జరుగుతోందన్నారు. ఈ నెల 8వ తేదీ లోపుగా అన్ని పోలింగ్ బూత్‌ల పరిధిలో స్లిప్పుల పంపిణీ ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. ఓటు వేసేందుకు వెళ్లే సమయంలో ఈ స్లిప్పులతో నిర్దేశించిన ఏదో ఒక గుర్తింపు కార్డును కూడా తీసుకువెళ్లాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

ఫెసిలిటేషన్ కేంద్రాల ఏర్పాటు

కాకినాడ సిటీ: పోలింగ్ సిబ్బంది, ఉద్యోగులు, డ్రైవర్లు, పోలీస్ సిబ్బంది, వీడియో గ్రాఫర్లు తదితరులు పోస్టల్ బ్యాలెట్ వినియోగంపై షెడ్యూల ప్రకారం ఫెసిలిటేషన్ సెంటర్లు ఏర్పాటు చేశారు. కాకినాడ జిల్లాలోని తునిలోని ప్రభుత్వ జూనియర్ కాలేజ్, ప్రత్తిపాడులో జెడ్పీ హైస్కూల్, పిఠాపురంలోని బాదం మాధవరావు ప్రభుత్వ గరల్స్ హైస్కూల్, కాకినాడ రూరల్ జెడ్పీ హైస్కూల్, రమణయ్యపేట, పెద్దాపురం లూథరన్ హైస్కూల్, కాకినాడ సిటీ పీఆర్ కాలేజ్ అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, జగ్గంపేట ప్రభుత్వ డిగ్రీ కాలేజ్, ఇతర జిల్లాల ఓటర్లు ఉంటే వారు పీఆర్ కళాశాల, అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ కాకినాడలో ఫెసిలిటేషన్ సెంటర్లు ఏర్పాటు చేశారు.